
మల్లాది వెంకట కృష్ణమూర్తి



# సాక్ష్యం

ఇంత పెద్ద దొంగతనం చేయడం ఇదే ప్రథమం నాకు. అందుకే కొంచెం భయంగా వుంది. చేతిగడియారం వంక చూసుకున్నాను. రెండూ నలభై అయింది.

చెట్టుకింద నిలబడటంవల్ల ఎండ మీద పడటంలేదు. ఎదురుగా చూశాను. బేంక్ ముందు అందులో పని చేసే వుద్యోగుల స్కూటర్లు, సైకిళ్ళు తప్ప ఇంకేం లేవు.

హైద్రాబాద్ నగరంలో చాలా దూరంగా వున్న ఇండస్ట్రియల్ ఏరియా వుప్పల్ కివెళ్ళే దారిలో వుందా బేంక్. పొడుగాటి తారురోడ్ నిర్మానుష్యంగా వుంది.

ఓ ఇంట్లో వుందా బేంక్. చాలా చిన్న బ్రాంచ్ అది. ఇండస్ట్రియల్ ఏరియాలోని వివిధ కంపెనీల్లో పని చేసే వుద్యోగస్థుల ఎకౌంట్లకోసం ఆ బ్రాంచ్ తెరిచారు. నాలుగయిదు కంపెనీలుకూడా కరెంట్ ఎకౌంట్స్‌ని ఓపెన్ చేసాయి.

ఓ ఎరువుల కంపెనీ ప్రతీ శుక్రవారం తమ కేష్ చెస్ట్‌లోని డబ్బంతా ఆ బేంక్‌లో డిపాజిట్ చేస్తుంది. మళ్ళా సోమవారం వుదయం విత్‌డ్రా చేస్తుంది.

ఆ రోజు యాభై ఆరువేల రూపాయలు తీసుకువచ్చి డిపాజిట్ చేశాడు ఆ ఎరువుల కంపెనీ కాషియర్. నా అంచనా ప్రకారం ఓ లక్ష రూపాయిలయినా వుంటుది ఇప్పుడు కేషియర్ దగ్గర.

చిన్నచిన్న దొంగతనాలు చేసి విసిగిపోయాను. ఒకేసారి పెద్దమొత్తం దొంగిలించాలనే ఆలోచన వచ్చి నెల దాటింది. అంత డబ్బు ఎక్కడ దొరుకుతుంది.

అన్వేషణ ప్రారంభించాను. చిట్‌ఫండ్ కంపెనీలన్నీ నగరంలోని రద్దీగావుండే ప్రదేశాలలో వున్నాయి. జనం అట్టే తిరగని చోట వెయ్యాలి.

ఫలితంగా హైదరాబాద్ నగరం బయట వున్న చిన్నచిన్న బేంక్‌లని పరిశీలించాను. అన్నిటికన్నా శ్రేయస్కరమయిన బేంక్‌ని ఎన్నుకున్నాను.

తర్వాత ఆ బ్రాంచ్‌ని వరసగా వారం రోజులు జాగ్రత్తగా కనిపెట్టాను. క్రిందటి శుక్రవారం ఎరువులకంపెనీ కేషియర్ కారులోంచి దిగుతూ కనబడ్డాడు. అప్పుడు గుర్తుకు వచ్చింది నాకు ఆ కంపెనీలో పనిచేసే ఫోర్‌మెన్ ఒకప్పటి నా స్నేహితుడు, శుక్రవారం కేషియర్ డబ్బుని ఆ బేంక్‌లో జమకడతాడని చెప్పిన సంగతి.

దాదాపు రెండు సంవత్సరాల క్రితం చెప్పాడు నాకది. ఆ సమాచారం యిప్పుడు ఉపయోగించింది. అందుకే ఈ శుక్రవారం ఎన్నుకున్నాను. ఆ ఎరువుల కంపెనీకి ఫోన్ చేసాను ఉదయం.

"హలో. నేను మీ బేంక్ నుంచి మాట్లాడుతున్నాను. ఇవాళ ఎంత జమ కడుతున్నారు?" అడిగాను.

"ఏభై ఆరువేలు. ఎందుకు?" కాషియర్ కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు అవతలివైపు నుంచి.

"ఏంలేదు. పాతికవేలు విత్‌డ్రా చేయడానికి ఓ కష్టమర్ వచ్చాడు. తక్కువ మొత్తం వుంది మా దగ్గర....ఇస్తున్నాం. లేకపోతే మా మెయిన్‌బ్రాంచ్‌కి ఫోన్ చేసి తెప్పించాలి కేష్. థాంక్స్."

ఫోన్ పెట్టేశాను.

ఇంతా కష్టపడి ఎరువులకంపెనీ కేషియర్ ఏ పదివేలో డిపాజిట్ చేస్తే ప్రయత్నం

అంతగా లాభించదు.

ఏభై ఆరువేలు:

కనీసం ఏభై ఆరువేలు.

కొత్త వుత్సాహం కలిగింది నాకు.

దాదాపు ఒకటిన్నరకి కారు దిగి చేతిలో బ్రీఫ్‌కేస్‌తో వెళ్ళాడు కేషియర్. వెనకాలే ఆ కంపెనీ సెక్యూరిటీ ఆఫీసర్, ఇద్దరు వాచ్‌మన్‌లు వెళ్ళారు బేంక్‌లోకి.

ఆ ముగ్గురూ లేకపోతే ఆ డబ్బు బేంక్‌కి చేరేదాకా ఆగక్కరలేదు నేను. బేంక్‌లో వాచ్‌మన్ ఒకడే వుంటాడు. సెక్యూరిటీ ఆఫీసర్ అయితే జాగ్రత్తగావుంటాడు డబ్బు బేంక్‌లో జమకట్టబడేదాకా.

వాచ్‌మన్ అంత అప్రమత్తంగా వుండడు.

పేంట్‌కీ, నడుముకీ మధ్య వుంచిన కత్తిని ఓసారి తడుముకున్నాను. దాని అవసరం రాకూడదు. కాని బెదిరించడానికి, పారిపోవడానికి అది చాలా ముఖ్యం.

నెమ్మదిగా కదిలాను. గోడవారగా ఆపి వుంచిన స్కూటర్‌దగ్గర ఆగి కొన్ని నిముషాలు దాంతో తంటాలు పడ్డాను. హెయిర్‌పిన్‌తో దాని తాళం తెరిచాను. నే పారిపోయేందుకు దాన్నే వుపయోగించదలచుకున్నాను.

ఓసారి అటూ ఇటూ చూసాను.

దూరంగా ఓ లారీ వస్తోంది. ఓ ముసలాయన పంచెతో వస్తున్నాడు కొద్ది దూరంలో.

ఇంకెవరూ లేరు.

జేబులోంచి సిద్ధంగా వుంచుకున్న సంచీని తీసి ముఖంమీద తొడుక్కొన్నాను. కళ్ళ దగ్గర, నోటి దగ్గర, రంధ్రాలున్నాయి వాటికి.

ఓసారి గట్టిగా వూపిరి పీల్చి కదిలాను.

టైం.


టైంమీద ఆధారపడి వుంటుంది నా విజయం అంతా.

మెరుపులా వెళ్ళి మెరుపులా బయటికి రావాలి డబ్బుతో.

వాచ్‌మన్ లేడు నేనూహించినట్లుగానే. మనసులో నవ్వుకున్నాను. వాడి వుద్యోగం వూడటం తప్పదు. కొద్ది దూరంలో వున్న ఇరానీ రెస్టారెంట్‌కి వెళ్ళాడు టీ తాగడానికి. రోజూ అదే టైంకి వెళ్తాడు.

చకచకా లోపలకి వెళ్ళాను.

మేనేజర్ కౌంటర్స్ వున్న గదిలో లేడు.




అప్పుడప్పుడు బయటికి వచ్చి వర్కర్స్ దగ్గర కూర్చొని బాతాఖానీ కొడుతుంటాడు.

అదృష్టం.

లోపల తన గదిలోనే వున్నాడు.

రిసెప్షన్ కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తి తల వంచుకుని టోటల్స్ కూడుకొంటున్నాడు జాగ్రత్తగా.

చిన్నగా దగ్గాను.

తలెత్తి చూసాడు. మరుక్షణం అతని కళ్ళలో ఆశ్చర్యం, వెంటనే భయం ప్రవేశించడం స్పష్టంగా చూసాను. పక్కనే పేమెంట్స్‌లో కేషియర్ సీట్‌లో లేడు.

నా చేతిలోని బాటిల్‌ని కౌంటర్‌మీదపెట్టి చెప్పాను.

"నేను అయిదు లెక్కపెట్టేలోగా డబ్బంతా తీసి ఇక్కడ పెట్టు. లేదా ఈ ఏసిడ్ నీ మొహంమీద చల్లుతాను. ఇంకెందుకూ పనికిరావు."

ఇంకా తెల్లబోయి చూస్తున్నాడు నావంక.

"త్వరగా. కాలిన నీ మొహం నీ భార్యకి ముద్దొస్తుందా? కళ్ళుపోయాక యీ బేంక్‌లో ఉద్యోగం చేయగలవా? ఊ క్విక్."

బాటిల్ ని కుడిచేత్తో పట్టుకున్నాను.

క్షణాల్లో భయంగా నోట్లకట్టలు కౌంటర్ మీద వుంచాడు. అవన్నీ రూపాయ కట్టలే.

"ఇంక లేవా?" గద్దించాను.

తల అడ్డంగా తిప్పాడు.

ఇద్దరు క్లర్కులు వెనకాల గదిలో కేరంబోర్డు ఆడుకొంటున్న చప్పుడు వినిపిస్తోంది. ఓ ఆఫీసర్ అటువైపు తిరిగి పని చేసుకుంటున్నాడు. నేను ముందే అంతా వూహించినట్లే జరిగిపోతోంది.

ఇంకా ఎవరూ నన్ను గమనించలేదు.

"ఏభై ఆరువేలు!" గుసగుసలాడుతున్నట్లుగా కసిరాను. చేతిలోకి బాటిల్‌ని అందుకున్నాను కౌంటర్‌మీద నుంచి.

భయపడ్డాడు. వెంటనే వందరూపాయల కట్టలని కౌంటర్‌మీద వుంచాడు నా చేతిలోని ఆ సీసావంక చూస్తూ. మొహంనిండా భయం. మా ఇద్దరి ముఖాలనిండా భయం. అతని భయాన్ని నేను చూడగలుగుతున్నాను. కాని నా భయానికిపైన ఓ తెరవుంది.

వాటిని ఎడంచేత్తో అందుకుని జేబులో కుక్కుకున్నాను ఆత్రంగా.

అప్పుడు బయటికి వచ్చాడు మేనేజర్. కనుకొలకులలోంచి చూసాను. వెంటనే అటువైపు తిరిగాను.

ఆయన కొన్ని క్షణాలు రాయిలా నిలబడిపోయాడు తన గదిగుమ్మంముందే, ఆశ్చర్యంగా నా మొహంమీది ముసుగుని చూస్తూ.

కౌంటర్‌లో యేదో కదిలికని చూసి అటు చూసాను. అప్పటికే కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు కేషియర్. తన చేతిని ముందుకు చాపి నా కుడిచేతిలోని హార్లిక్స్ బాటిల్‌ని పట్టుకుని బలమంతా వుపయోగించి అందులోని ద్రవాన్ని నా మీదకు చల్లాడు. చాలా భాగం నా ఛాతీమీదకి వలికింది.

అందులో ఏసిడ్ లేదు. భయపెట్టి పని త్వరగా చేయించడానికి రంగు కలిపిన నీళ్ళు పోసుకువచ్చాను.

మేనేజర్ ఆశ్చర్యంలోంచి తేరుకుని కదిలాడు. పని చేసుకుంటున్న ఆఫీసర్ కూడా

లేచాడు. నేను సీసాలోని మిగిలిన నీళ్ళని కేషియర్ మొహంమీదకి బలంగా చల్లి గుమ్మంవైపు దూకాను.

సీసాని వదలకుండా బయటకి పరిగెత్తాను వేగంగా.

వెంటనే కారు చక్రాలు కీచుమనడం, నాకు కొన్ని అంగుళాల దూరంలో ఓ ఫియట్ కారు ఆగడం క్షణాలలో జరిగిపోయాయి.

డ్రయివర్ సీట్‌లో ఓ ముసలాయన కూర్చుని కంగారుగా చూస్తున్నాడు నావంక.

మెరుపులా అతని కారు తలుపు ఎడంచేత్తో తెరిచి వెనకసీట్‌లో కూర్చున్నాను. సీసాని ఎడంచేతిలోకి మార్చుకొని కుడిచేత్తో కత్తిని లాగి అతని మెడకి అడ్డంగ ఆనించి అరిచాను శక్తికొద్దీ.

"పోనీ."

మళ్ళీ అరిచాను.

"నేను హంతకుడిని. పోనీ."

కారు కదిలింది. వెనకనించి అరుపులు వినబడుతున్నాయి.

నా గుండె భయంతో కొట్టుకుంటోంది.

"పోనీ. నే చెప్పేదాకా ఆపద్దు. బ్రతకాలని వుంటే పోనీ."

ఆ ముసలాయన భయంతో రొప్పుతూ అన్నాడు.

''నన్ను చంపకు''

తర్వాత నేను మాట్లాడలేదు. ఆయనా మాట్లాడలేదు. స్టీరింగ్ వీల్‌మీది ఆయన చేతులు వణుకుతున్నాయి.

తారనాక చేరాక చెప్పాను.

"యూనివర్సిటీ రోడ్‌వైపు."

ఎడం చేతివైపు తిప్పాడాయన కారుని.

నా చేతిలోవున్న కత్తి అంచుని ఆయన మెడమీదనుంచి తీయలేదు. ఆలోచిస్తున్నాను అప్పుడే. ఆ బేంక్ మేనేజర్ ఫోన్ చేయగానే ఎంత త్వరగా వస్తారు పోలీసులు? ఈ కారు నంబర్ గుర్తుపెట్టుకుని పోలీసులకి చెప్పివుంటాడా? కనీసం చాక్‌లెట్ కలర్ ఫియట్ కారని చెప్పినా చాలు. వైర్‌లెస్ సౌకర్యంవున్న పోలీస్ పెట్రోల్ కారు బహుశ ఇప్పుడు ఇటే వస్తుందేమో?

దూరంగా ఆగివున్న ఆటోని చూసాక వెంటనే ఏంచేయాలో నిర్ణయించుకున్నాను.

మొహంమీద తొడుక్కున్న సంచీని చింపేసాను విప్పదీస్తూంటే ముసలాయనకి తిరగబడే అవకాశం కలగచ్చని.

"ఆ ఆటోప్రక్కన ఆపు కారు. ఆగాక తాళం చెవులగుత్తి నాకివ్వు? లేదా....?"

కారు ఆటో ప్రక్కన ఆపాడు. ఈలోగా సంచీతో సీటు శుభ్రంగా తుడిచాను వేలిముద్రలు చెరిగిపోవడానికి.

కారుదిగి నవ్వాను గట్టిగా.

''అలాగే సార్....తప్పకుండా వస్తాను. థాంక్స్ ఫర్ ది లిఫ్టు. ఆటో వుందిగా వెళ్తాను.''

మాట్లాడుతూ కారు తలుపు పిడిమీది వేలిముద్రలు తుడిచేశాను సంచీతో. ముందు తలుపు కిటికీలోంచి వంగి ఇగ్నిషన్‌కీ అందుకున్నాను.

ఆయన నా మొహంవంక ప్రశాంతంగా, నిశితంగా చూశాడు.

నన్ను గుర్తుపడతాడా మళ్ళీ ఇంకోసారి చూస్తే?

"జాగ్రత్త. నన్నెప్పుడయినా గుర్తుపడితే, పోలీసులకి సహాయంచేస్తే ఈ భూమిమీద నూకలు చెల్లినట్లే నీకు. ఇక్కడగొడవ చేస్తే పొడిచేస్తాను వెంటనే."

రహస్యంగా, కర్కశంగా చెప్పాను.

ఆటోలో కూర్చుని "పోనీ" అన్నాను.

ఆటో కదిలాక "సీతాఫల్‌మండి. త్వరగా" చెప్పాను.

ఆటోవాడికి ఏం అనుమానం కలగలేదు. నా వంక తిరిగి చూడకుండా పోనిచ్చాడు.

నాలుగయిదు నిముషాల తర్వాత ఓ నీలం రంగు అంబాసిడర్ మా ఆటోని దాటుకుని ముందుకు దూసుకుపోయింది.

అది పోలీస్ పెట్రోల్ కారు.

ఆటో న్యూట్రిషన్ లేబ్స్ దాటి సీతాఫల్‌మండివైపు తిరిగింది. ఓ నిముషం తర్వాత, సీతాఫల్‌మండి లోకల్ రైల్వేస్టేషన్ దగ్గర ఆటో దిగి మీటర్‌మీద ఇరవై పైసలిచ్చాను.



ప్రక్కనే ఆగివున్న ఇంకో ఆటో ఎక్కి "బషీర్ బాగ్" చెప్పాను గట్టిగా ఆ ఆటోవాడు వినేలాగా.

ఆ ఫియట్ కారులోని ముసలాయన ఆటో నంబర్ గుర్తుపెట్టుకుని తర్వాత పోలీసులకి తెలియచేస్తే, ఆ ఆటోవాడు నేను బషీర్ బాగ్ వెళ్ళానని చెప్తాడు.

ఆటో సికింద్రాబాద్ స్టేషన్ రాగానే దిగి మీటర్ మీద ఓ రూపాయ ఇచ్చి చెప్పాను.

"బషీర్ బాగ్ బస్ లో వెళ్తాను ఇక్కడ నుంచి. ఆటో అవసరం లేదు."

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో సిద్ధంగా వుంది బొలారం వెళ్ళే లోకల్ ట్రెయిన్. అందులో ఎక్కాను టిక్కెట్ కొనుక్కుని.

నా షర్ట్ మీద లీలగా ఒలికిన నీళ్ళు కనబడుతున్నాయి.

రైలు బయలుదేరాక ఆ ఫోర్లిక్స్ సీసాని కిటికీలోంచి బయటికి విసిరేశాను దూరంగా. ఓ రాయికి కొట్టుకుని పగిలి ముక్కలయింది. ఆ సీసా పోలీసుల చేతిలో పడివుంటే నా వేలి ముద్రలు దొరికేవి. అవి దొరికితే నే చిక్కేదాకా నాకోసం వేటాడుతారు. వాళ్ళ రికార్డులో నా వేలిముద్రలున్నాయి.

లేచి బాత్ రూంలోకి వెళ్ళాను. తలుపు లోపల గడియపెట్టి ఓ జేబులోంచి నోట్ల కట్టలని బయటకి తీసి లెక్కపెట్టాను. ఆరు వందరూపాయల కట్టలు. ఎనిమిది పదిరూపాయల కట్టలు. నాలుగు రూపాయల కట్టలు. ఏడు అయిదు రూపాయల కట్టలు. మొత్తం డబ్బయి ఒక్కవేల తొమ్మిదివందల రూపాయలు.


సంతోషం, విచారం రెండూ కలిగాయి నాకు. కనీసం లక్ష సంపాయించగలిగితే ఇంకా ఆనందంగా వుండేది.

బాత్ రూం తలుపు తెరుచుకుని బయటకి వచ్చాను.

ఒక్కటే నా మనసుని తొమ్మరిపురుగుగా తొలుస్తోంది. నా గడ్డం కుడిభాగంమీద నల్లటి మచ్చ వుంది. ఆ ముసలాయన దాన్నికూడా చూసాడా? చూసి గుర్తుపెట్టుకున్నాడా? ఆ సంగతి పోలీసులకి చెప్పేస్తాడా?

కుడి గడ్డంమీద కాలిన మచ్చవున్న వ్యక్తి గురించి పోలీసులకి తెలిస్తే నేను చిక్కినట్లే లెక్క. కిటికీలోంచి బయట చూడసాగాను ఆలోచనగా.

వాళ్ళు నన్ను పట్టుకునే లోపలే డబ్బుని




దాచేయాలి. అదేమంత కష్టమయిన పనికాదు. నా గదిలోని నల్లటి బ్రీఫ్ కేస్ గుర్తుకు వచ్చింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లోని సామాను భద్రపరిచేగది గుర్తుకు వచ్చింది.

కాని పట్టుకుని రెండు సంవత్సరాలు శిక్ష వేస్తే? అంతకాలం సామాను వుంచరు. క్లోక్ రూంలో.

బేంక్ లో లాకర్ తీసుకుని నాలుగేళ్ళ అద్దె ముందే కట్టేయాలని నిశ్చయించుకున్నాను.

* * *

గోడకి ఆనుకుని నిలబడ్డాను.

నాకు కుడివైపు అయిదుగురు, ఎడంవైపు ముగ్గురు నిలబడ్డారు. మొత్తం తొమ్మిదిమంది. చాలామందిని గుర్తుపట్టాను. వాళ్ళు దొంగతనాలుచేసేవాళ్ళే. ఒకళ్ళిద్దరు ఎవరో తెలియలేదు.

ఆదివారం ఆరోజు.

శనివారందాకా నేను గదికి వెళ్ళలేదు. ఉదయం ఓ బేంక్ లో లాకర్ తీసుకుని డబ్బు అందులో భద్రపరిచి లాకర్ కీని చిన్న స్టీల్ పెట్టెలో పెట్టి దాన్ని మలక్ పేటలో ఓ గుడి ప్రాంగణంలో ఓ చోట రహస్యంగా పాతిపెట్టాకగాని గదికి చేరుకోలేదు.

శనివారం రాత్రి పోలీసులువచ్చి తీసుకెళ్ళారు. శుక్రవారం మధ్యాహ్నం పన్నెండు నుంచి ఏం చేస్తున్నావని, ఎక్కడున్నావని ప్రశ్నించారు. యాదగిరి గుట్టకి వెళ్ళానని చెప్పాను. ఇంకేం ప్రశ్నించకపోవటంతో నామీద అనుమానం అట్టే లేదని, రొటీన్ చెకప్ చేస్తున్నారని వూహించి తృప్తిపడ్డాను.

కాని నేను ఐడెంటిఫికేషన్ పెరేడ్ లో పాల్గొనాలని తెలియగానే భయంవేసింది. నన్ను ఆ ముసలాయన, ఆటో డ్రయివర్ గుర్తుపడతారు. ఆ డబ్బు ఎక్కడ దాచావో చెప్పమని నా ప్రాణాలు పోకుండా జాగ్రత్తపడుతూ ఎన్నోవిధాలుగా హింసిస్తారు పోలీసులు....

నన్ను ఫియట్ కారులో కొంతదూరం తీసుకెళ్ళిన ముసలాయన వచ్చాడు ఆ గదిలోకి. ఆయన వెనకాలే ఆటో డ్రయివర్లు ఇద్దరిలో ఎవరూ రాలేదు!

అంటే ముసలాయన ఆటో డ్రయివర్ నంబర్ గుర్తుపెట్టుకోలేదన్న మాట.

కదలకుండా వరసగా నిలబడ్డ మమ్మల్ని ఒకొక్కరినే పరిశీలనగాచూస్తూనడుస్తున్నాడు.

నా గుండె గుబగుబలాడుతోంది. నా గుండె చప్పుడు ప్రక్కన నిల్చున్నవాళ్ళకి వినబడుతుందేమోనన్న భయం కలిగేంతగా వేగంగా స్పందిస్తోంది.

ఒకరు.

ఇద్దరు.

ముగ్గురు.

నాలుగో వ్యక్తిని చూసి నాకు కుడివైపు నిల్చుని వున్న వ్యక్తిముందాగి చూసాడు.

నా కళ్ళలోకి, మొహంలోకి భయం ప్రాకుతోంది వద్దనుకున్నా. ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ ముసలాయన ప్రక్కనే నడుస్తున్నారు.

నా దగ్గరికి వచ్చి నావంక చూసాడు. కనురెప్పయినా వేయకుండా ఆయన కళ్ళలోకి చూసాను.

నా ముందు ఆగి, 'వీడే' అని అరుస్తాడనుకున్నాను.

ఏం జరిగిందో గ్రహించే లోపలే నన్ను దాటి నాకు ఎడంప్రక్క నిలబడ్డ వ్యక్తి ముందాగి పరిశీలనగా చూసాడు.

తర్వాత ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగి అన్నాడు.

"వీడే."

"నేనా?"

అతను నివ్వెరపోతూ అడిగాడు.

అయోమయంగా చూసాడు అతను దగ్గరకి వస్తున్న ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్స్ వైపు.

ముసలాయన వెనక్కి తిరిగి గదిలోంచి బయటకి నడవసాగాడు నెమ్మదిగా.

"నేనుకాదు. ఆయన పొరబడ్డారు" అన్నాడతను గింజుకుంటూ.

"రా. రా. ఆ డబ్బు ఎక్కడ దాచావో నీచేతే చెప్పిస్తాను. రా" అన్నాడు ఇన్‌స్పెక్టర్ అతన్ని డొక్కలో చేతిలోని లాఠీతో పొడిచి.

బాధగా మూలిగాడు అతను. వెంటనే గట్టిగా అరిచాడు.

"మరోసారి చూడండి. నేను కాదు. నేను కాదు. మరోసారి చూడండి."

ఆ ముసలాయన కనీసం వెనక్కి తిరిగయినా చూడకుండా గుమ్మం దాటి బయటకి వెళ్ళిపోయాడు.

గోడకి ఆనుకున్న మిగతా అందరూ కదిలారు.

నన్ను గుర్తు పట్టలేదాయన! నిజం చెప్పడానికి భయపడ్డాడా!!

పోలీసులు లాక్కెళుతున్న ఆ మనిషి మొహం చూద్దామనుకున్నాను కాని కనబడలేదు. నా పోలికలు అతని మొఖంలో ఉండి ఉండచ్చు.

తృప్తిగా నిట్టూర్చి, జేబులోంచి చేతి రుమాలతీసి నుదుట పట్టిన చెమటని తుడుచుకున్నాను.

బయటకి నడిచాను అందరి వెనకా.

"నాకేం తెలియదు. ఆయన తప్పు చెప్పాడు" అరుస్తున్నాడు ఆ నిర్దోషి.

క్షణకాలం అతనంటే జాలి కలిగింది నాకు.

* * *

అదృష్టం ఎల్లకాలం ఒక్క మనిషినే అంటిపెట్టుకుని వుండదు.

డబ్బయిఒక్క వేలు సంవత్సరంన్నరలో అయిపోయాయి. ఇదివరకటి అనుభవంతో అదే పద్ధతిలో, మరికొన్ని జాగ్రత్తలు తీసుకుని ఇంకో బేంక్‌లో దొంగతనం చేసాను.

ఈసారి దురదృష్టం నా పక్షం వుండటంతో దొరికిపోయాను. పారిపోతూంటే వాచ్‌మన్ కాల్చిన తుపాకిగుండు నా కాలి మడమలో దిగింది.

డబ్బుతో దొరికిపోయాను..

హాస్పిటల్, విచారణ, కోర్టు, శిక్ష వరసగా జరిగిపోయాయి. నెలన్నర తర్వాత వూచలు లెక్కపెడుతూ జైల్లో కూర్చున్నాను.

చెట్లకి పాదులు చేస్తూంటే అతన్ని చూసి పలకరించాను. ముసలాయన నన్ను గుర్తుపట్టకుండా ఇంకొకరిని చూపి నేనేనని భయపడ్డాడు. అతనికి, ఆ దొంగతనం చేసాడనుకుని, శిక్ష వేసారు. అదేజైల్లో తారసపడ్డాడు నాకు.

నావంక ఎగాదిగా చూసాడు.

"ఏం చేసి వచ్చావ్?" అడిగాను.

"ఏం చేయలేదు. తప్పుడు సాక్ష్యంవల్ల వచ్చాను."

"నిన్ను ఆ ముసలాయన గుర్తుపట్టేటప్పుడు నేను నీ పక్కనే వున్నాను" చెప్పాను సానుభూతిగా.

ముందర అర్థం కానట్లుగా చూసాడు. తర్వాత పళ్ళు పట పట కొరికాడు అతను.

"ఆ బేంక్‌ని ఎవరు దోచుకున్నారో ఆ భగవంతుడికే తెలియాలి. కాని ఆ దొంగని పట్టిచ్చే ఏకైక సాక్షి ఆ ముసలాయన. ఆయన ఎవరిని చూపించి 'వీడేదొంగ' అంటే వాడు దోషి అవుతాడు చట్టం దృష్టిలో."

నేను మాట్లాడలేదు.

"ఇంకో ఆర్నెల్లలో బయట పడతాను ఆ తర్వాత...." మళ్ళీ పళ్ళు పట పట కొరికాడు.

"నువ్వా దొంగతనం చేయకపోతే మరి నిన్నెలా గుర్తుపట్టి 'వీడేదొంగ' అని చెప్పాడు?" అడిగాను గలగలా నవ్వుతూ.

"కావాలని"

"కావాలనా?" ఆశ్చర్యం నటిస్తూ అడిగాను.

"అవును."

"ఆయనకి పిచ్చా?"

"లేదు"

"మరి?"

"నన్ను జైలు పాలుచేయాలని."

"అంటే?" అడిగాను.

మొహంమీద పడ్డబురద నీటిని ఎడంచేత్తో తుడుచుకుని చెప్పాడు కసిగా.

"ఆయన రెండో కూతురు, నేను ప్రేమించుకున్నాం. ఆ అమ్మాయికి గర్భం వచ్చింది. నన్నుతప్ప ఇంకెవరినీ చేసుకోననీ, నాతో వచ్చేస్తాననీ, రిజిష్టర్ మేరేజ్ చేసుకుందామని చెప్పింది. కట్నంలేకుండా చేసుకోనన్నాను. ఆత్మహత్య చేసుకుందా పిచ్చిది. దాంతో నామీద కక్ష పట్టాడు."

"అసలా ఐడెంటిఫికేషన్ పెరేడ్‌లోకి నువ్వెలా వచ్చావ్?" అడిగాను అతని జేబులోంచి బీడీకట్టతీసి ఒకటి వెలిగించి.

"అదీ ఆయనపనే. కేషియర్‌కి ఆరోజు నేనే ఫోన్ చేసానని చెప్పాడు."

మనసులో నవ్వుకున్నాను. ఇతను వాళ్ళమ్మాయి విషయంలో చేసిన ఓ నేరంవల్ల నేను డబ్బుని, స్వాతంత్ర్యాన్ని అనుభవించగలిగాను.

"మరి ఈ సంగతులన్నీ జడ్జికి చెప్పలేదా?" అడిగాను నవ్వి.

"ఆముసలాయన కూతురినే నేను ప్రేమించానని నాకు శిక్షపడి జైలుకి వచ్చాక గాని తెలియలేదు. ఓరోజు వచ్చి చెప్పాడు నేను జైల్లో వుండటానికి అసలయిన కారణం. నా ఫోటో వాళ్ళమ్మాయి గదిలోవుంటే చూసాడుట. అప్పటినుంచీ ఎలా కక్ష తీర్చుకోవాలా అని ఆలోచిస్తున్నాడట."

"ఇంతకీ అసలాయన ఎవరు?" అడిగాను.

"ఆ రోజు ఆ బేంక్‌లో డబ్బు డిపాజిట్ చేసిన ఎరువుల కంపెనీ ప్రొప్రయిటర్" చెప్పాడు.

కొన్ని క్షణాలు బీడీ చివరవున్న నుసివంక చూస్తూండిపోయాను.

ఓ దమ్ము పీల్చి అడిగాను తర్వాత.

"ఇంతకీ ఆ డబ్బు ఎక్కడ దాచావ్?"